


## నెలనెలా నవ్వుల పండగ

# మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### పొదుపు

**కుక్కుటేశ్వరరావు** సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. అతను స్కూటర్ ఎక్కాక టాటా చెప్పింది అతనిభార్య

స్కూటర్ సందుమలుపు తిరిగాక ఆమె లోపలికి వచ్చిచూస్తే అతను ఆఫీసుకు తీసుకెళ్ళాల్సిన టిఫిన్ బాక్స్ మర్చిపోయాడని గ్రహించింది.

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి రాగానే చెప్పాడు కుక్కుటేశ్వరరావు ఆనందంగా.

"నాకు ప్రమోషన్ వచ్చింది తెలుసా? మధ్యాహ్నం లంచ్‌కి హోటల్ కి వెళ్ళాను. అక్కడ కొత్తగా క్లినిక్ తెరిచిన కుర్ర డాక్టర్ పరిచయం అయ్యాడు. ఆయన క్లినిక్‌కు కావాల్సిన సామానంతా మా ఫర్మ్ నించే ఆర్డర్ నా ద్వారా, పాతిక లక్షల రూపాయలకి పెట్టాడు. దాంతో నాకు ప్రమోషన్ ఇచ్చారు.."

"డబ్బంతా ఇలాగే వృధా చేస్తున్నారు. అసలు మీరు టిఫిన్ బాక్స్ మర్చిపోయి ఎందుకు హోటల్‌కి వెళ్ళాలి?" గయ్ మంది ఆమె.

**

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"నిన్న మా ఆవిడ పుట్టిన రోజు"

"ఏం బహుమతి ఇచ్చావు?"

"అయిదు వేలకు చెక్కు ఇచ్చాను.""

"ఇంటి ఖర్చులకే జీతం సరిపోవడం లేదని మొరపెడుతూ అప్పులకు బయలుదేర్తావు. బాంకులో అయిదువేలుందా?"

"అయిదు రూపాయలు మాత్రమే ఉంది. అదీ బాంక్ వాళ్ళు ఇవ్వరు కాబట్టి ఉండి పోయింది"

"మరి అయిదువేలకు చెక్కు ఎలా ఇచ్చావు మీ ఆవిడకి"

"ఆవిడ చస్తే బాంకుకు వెళ్ళదులే, మహా పిసినారి. డబ్బు తీస్తే ఎక్కడ ఖర్చయిపోతుందోనని చెక్కుని పెట్లో పెట్టి తాళం వేసేస్తుంది."

"అతన్ని చూసీ చూడగానే బ్రహ్మచారే, పెళ్ళయిన వాడు కాదు అని ఎలా చెపుతున్నావు?"

"వెరీ సింపుల్. బ్రహ్మచారి చొక్కాకు గుండీలుండవు. పెళ్ళయినవాడి చొక్కా జేబుకు చిరుగులుంటాయి."

సరోజమ్మకు పదహారేళ్ళ కూతురుంది. వాళ్ళింటికి దూరపు బంధువొకావిడ వచ్చి,

"అమ్మాయి కనబడదేం వదినగారూ?" అనడిగింది.

"మా అమ్మాయి సినిమానటి కాదలచుకుని, ట్రైనింగవుతోంది ఆర్నెల్లనుంచి."

"మంచిమాట చెప్పారు వదినగారూ. ఇప్పటివరకు ఏం నేర్చుకుంది?"

"ఇంకా మొదటి పాఠమే పూర్తవలేదు. ఉదయం పదకొండు గంటలదాకా నిద్రపోవడం అలవాటు చేసుకుంటోంది."

ఓ మహా నటుడిని మరో మహాకవి కలిశాడు.

"ఏమిటి మీరు ఇల్లు కట్టుకో బోతున్నారట. నిజమేనా?"

"ఇరవైయేళ్ళనుంచి డ్రామాలు వేస్తున్నాను. ఇన్నాళ్ళకు ఇంటికి సరిపడ రాళ్ళుపోగయ్యాయి. మొదటినుంచీ జాగ్రత్తపడ్డాను గనుక ఇల్లు కట్టుకోడానికి ఇబ్బందుండదు. ఇబ్బందల్లా ఎవడూ సిమెంటు బస్తాలు విసరటం లేదు. అందరూ రాళ్ళే."

ఒక సినిమా ప్రొడ్యూసర్‌ని మరో ప్రొడ్యూసర్ కలుసుకున్నాడు.

"నీ పిక్చర్ పూర్తయింది గదూ?"

"ఆ ఒకటో తారీఖునే విడుదల."

"కంగ్రాట్యులేషన్స్ ఇంతకీ అది సుఖాంతమా, దుఃఖాంతమా?"

"రిలీజయిన వారం రోజుల్లో తెలిసిపోతుందా సంగతి."

"ఉయ్యూరు దేనికి ప్రసిద్ది?" మాస్టారు తన క్లాసులో ఒక కుర్రాణ్ణి ప్రశ్నించాడు"

"నాకు తెలియదు"

"తెలియదూ? మనకు పంచదార ఎక్కణ్ణుంచి వస్తోందనుకున్నావురా నాయనా?"

"మేం మామూలుగా పక్కిళ్ళవాళ్ళ దగ్గరనుంచి అప్పు తెస్తుంటామండీ"

"అమ్మా! మహా తల్లీ" బిచ్చగాడి అరుపు.

"ఏమిటోయ్ గొడవ?"

"అమ్మా! మీ పక్కింటి మా తల్లి మినప రొట్టె పెట్టింది. దానికి తోడుగా కాస్త పచ్చడి ముక్క ఉంటే పడేయండమ్మా"

"అయ్యో పాపం అయినా నీక్కావలసింది పచ్చడి ముక్కకాదు అజీర్ణ మాత్రలు. తెస్తానుండు."

COMMENTS